బీజేపీ నూతన కమిటీ ఎన్నిక



కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ బీజేపీ నూతన కమిటీలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించినట్లు కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం.రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్‌లు తెలిపారు. శనివారం దోమలగూడ గగన్ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు నూతన కమిటీని ప్రకటించారు. కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడుగా సలంద్రి దిలీప్ యాదవ్, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాస్ ముదిరాజ్ , బి.కనకయ్య,జి.శ్రీధర్ (వాసు), సి శివశంకర్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.కేశవ రాజు, బొల్ల రమేష్‌బాబు, కార్యదర్శులుగా కె. సత్యనారాయణ, పి.రమేష్,సావిత్రి, పి. సూర్యనారాయణ, జగదీష్ నియమితులైనట్లు వారు తెలిపారు.

బీజేపీ కార్యదర్శికి సన్మానం



నల్లకుంట: బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శులుగా ఎంబి కిషోర్ కుమార్, ఎం. మల్లిఖార్జున్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. ప్రదీప్ కుమార్ నూతనంగా నియమితులైన వారిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్ కుమార్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు.

అందరూ ఐక్యంగా ఉండాలి



థామస్ జాన్‌ను సత్కరిస్తున్న రెవరెండ్ డాక్టర్ ప్రొఫెసర్ రూబెన్స్ మార్క్, ప్రిస్టీలీ గైస్

కాచిగూడ: కుల మతాలకతీతంగా ప్రజలందరూ ఐక్యంగా ఉండి అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని దక్షిణ భారత డిప్యూటీ మోడరేటర్ చర్చి రెంరెండ్ డాక్టర్ ప్రొఫెసర్ రూబెన్స్ మార్క్ పిలుపునిచ్చారు. వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం నారాయణగూడ లోని వైఎంసీఏలో వైఎంసీఏ 181వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎంసీఏ ఆధ్వర్యంలో విశేష సేవలందించిన థామస్ జాన్, పి.కృపాకర్, కె.వి.ప్రసాద్, ప్రేమ్ కుమార్ నైని, గోనేహ్, సోలమన్ రాజ్, టి.సంజీవ్ కుమార్, సిహెచ్.ఎస్తేరు రాణి తదితర ప్రముఖులను ఘనంగా సత్కరించి అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి సురేష్ థియేటర్ సమీపంలోని శ్రీగిరి జ్యోతిష్యాలయంలో ఈనెల 8, 9తేదీల్లో చేపమందు ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకుడు శంకర్ ముఖియా తెలిపారు. చేపమందు పంపిణీ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన విష్కరించారు. ఈ సందర్భంగా శంకర్‌ముఖియా మాట్లాడుతూ 8న ఉదయం రాజ్యసభ సభ్యుడు అనిక్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ సామల హేమ, శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావులు ముఖ్యఅతిథులుగా హాజరై చేపమందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. 45 సంవత్సరాలుగా చేపమందు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలపై ఉదాసీనత తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవేటు ఇంజినీరింగ్ అక్రమాల పై రాష్ట్ర ఉన్నత విద్య మండలి అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడం తగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయాలకు ఇంజినీరింగ్ సీట్లను అమ్ముకుంటున్న ప్రైవేటు కాలేజీల గుర్తింపును రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు.



ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



బక్రీద్ పండుగ సందర్భంగా హిందూముస్లిం సోదరుల ఆలింగనం

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో శనివారం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని 26 మసీదులలో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. భోలక్‌పూర్‌లోని బడిమసీదులో వేలాది మంది ప్రార్థనలు నిర్వహించారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఎస్సైలు భారీ బందోబస్తు నిర్వహించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా బక్రీద్ శుభాకాంక్షలు ముస్లీం సోదరులకు తెలియజేశారు.

కవాడిగూడ: కవాడిగూడలో శనివారం బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎన్‌టిఆర్ స్టేడియంలో తెలంగాణ ప్రభుత్వ క్వాజిస్ అసోసియేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో జంటనగరాల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బడి మసీదులో ప్రార్థనలు



బందోబస్తు నిర్వహిస్తున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తదితరులు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



కాచిగూడ రైల్వే స్టేషన్‌ను సందర్శించిన హైదరాబాద్ ఏడీఆర్ఎం ముత్యాల నాయుడు

కాచిగూడ: రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఏడీఆర్ఎం ముత్యాల నాయుడు అన్నారు. శనివారం కాచిగూడ రైల్వే స్టేషన్‌ను ఏడీఆర్ఎం అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వెయిటింగ్ హాల్, బుకింగ్, అన్ని ప్లాట్ ఫారమ్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, క్లాక్ రూమ్‌లు, స్టాల్స్, సర్క్యులేషన్ ఏరియాను తనిఖీ చేశారు. సీనియర్ డీజీఎం అనిరుథ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్లను పట్టించుకోకపోవడం దారుణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రెండు రోజుల క్రితం జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో పెన్షనర్ల సమస్యల గురించి ప్రస్తావించకపోవడం బాధాకరమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ.రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవి.నర్సింగరావు, కోశాధికారి బి.నరసయ్యలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బాగ్ లింగంపల్లిలోని తమ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెన్షనర్లకు 5 డీఏ బకాయిలు ఉండగా ఒక డిఏ పట్ల తీవ్ర నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఏ.రాజేంద్రబాబు

విద్యాభవనాల నిర్మాణానికి కృషి



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను కలిసిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బంగ్ల భారతి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అధునాతన విద్యాసంస్థల భవన నిర్మాణాల కోసం కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ జి.బంగ్ల భారతి శనివారం ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తోపాటు అధ్యాపకులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతాఫల్‌మండి గవర్నమెంట్ స్కూల్ ప్రాంగణంలో జూనియర్ , డిగ్రీ కాలేజీలు గత ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేయించామన్నారు. ఇక్కడ కొత్త భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల మేరకు నిధులను అప్పుడే మంజూరు చేయించామని తెలిపారు. ఇటీవలే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలో భవననిర్మాణం పనులు ప్రారంభించడం కోసం ప్రయత్నాలు చేస్తున్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ప్రయాణికురాలికి బంగారం, నగదు అప్పగింత

సికింద్రాబాద్: రైలు ప్రయాణం ద్వారా నగరానికి చేరుకున్న ఒక మహిళా ప్రయాణికురాలు స్టేషన్‌లో మరిచిపోయిన బ్యాగును అందులోని నగదు, ఆభరణాలను ఆర్పీఎఫ్ పోలీసులు శనివారం ఆమెకు అప్పగించారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సారస్వత్ తెలిపిన మేరకు... ఈనెల 6న నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో జకియాబేగం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. స్టేషన్ నుంచి బయటకు బయటకు వెళ్లే హడావుడిలో తన లగేజీ బ్యాగులను స్టేషన్‌లోనే మరిచి పోయింది. స్టేషన్ విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ బృందం సదరు లగేజీ బ్యాగులను భద్రపరిచారు. అందులో లభించిన గుర్తింపు కార్డుల ఆధారంగా ప్రయాణికురాలికి సమాచారం అందించారు. ఆర్పీఎఫ్ స్టేషన్‌కు ప్రయాణికురాలిని రప్పించిన పోలీసులు బ్యాగులతోపాటు అందులోని రూ.7 లక్షల విలువ చేసే నక్లెస్, ఉంగరాలు, గొలుసు తదితర బంగారు ఆభరణాలు, రూ.29 వేల నగదును అందించారు.



ప్రయాణికురాలి ఆభరణాలు అందిస్తున్న ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సారస్వత్

యువకుడిని రక్షించిన ఆర్పీఎఫ్

సికింద్రాబాద్-లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య ఆత్మహత్యకు యత్నించిన ఒక యువకుడిని ఆర్పీఎఫ్ పోలీసులు శనివారం రక్షించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో రైల్వే ట్రాక్ పక్కనే తచ్చాడుతున్న ఒక యువకుడిని విధుల్లో ఉన్న ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించారు. రైలు వస్తున్న సమయంలో ట్రాక్ మీదకు వెళ్లేందుకు ప్రయత్నించిన అతనిని పోలీసులు పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడ ప్రాంతానికి ప్రైవేటు ఉద్యోగి నంద కిశోర్(37) గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఛాతి నొప్పి రావడంతో గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఈసీజీ తీసి డాక్టర్‌కు చూపించే ప్రయత్నంలో క్యూలో ఉన్న నందకిశోర్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గుండె నొప్పి తీవ్రం కావడంతో ఆయన మరణించాడు. ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నంద కిశోర్ మరణం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.



నంద కిశోర్

గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలి



కాచిగూడ: గృహ కార్మికుల కోసం సమగ్ర చట్టం చేయాలని నేషనల్ ప్లాట్ డొమెస్టిక్ వర్కర్స్ తెలంగాణ యూనియన్ ప్రతినిధులు శనివారం బర్కత్‌పురలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. గృహకార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల 16వ తేదీన జరిగే అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవంలో పాల్గొనాలని కోరుతూ వారు కేంద్రమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలి

కాచిగూడ: బీసీ జనాభాలో అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుని రాజ్యాధికార సాధన దిశగా ముందుకు సాగాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యాలయాన్ని వీహెచ్ సందర్శించిన సందర్భంగా మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో ప్రతినిదులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మణికొండ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బీజేపీ డివిజన్ కార్యవర్గం ఎంపిక

అంబర్‌పేట: బీజేపీ బాగ్‌అంబర్‌పేట డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షులు నాగరాజు చారి శనివారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా ఎం.పరమేష్ యాదవ్, ఎం.రోహిత్‌గౌడ్, పి. సునంద, ప్రధాన కార్యదర్శులుగా ఈ.బాలకృష్ణ, ఈ.యోగేశ్‌గౌడ్, కార్యదర్శులుగా యు.శ్రీనివాస్, బీ.రవీందర్, విజయ లక్ష్మీ, జి. శ్రీనివాస్, కోశాధికారిగా బీ.శివలతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. అలాగే డివిజన్ మోర్చా విభాగల కమిటీలను కూడా నియమించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు



బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. నారాయణ, ఎం.పి సునీల్, అనిత, శ్రావణ్, రాజశేఖర్, డి. శ్రీనివాస్, రమేష్, డాక్టర్ శివకుమార్ లాల్, బాలక్రిష్ణ, రమేష్, జగదీష్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ చొరవ అభినందనీయం

కాచిగూడ: రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉద్యోగులు ఉంటారని టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ అసోసియేట్ అధ్యక్షుడు, బీటీఎన్జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. శనివారం సొసైటీ కార్యాలయంలో సత్యనారాయణ గౌడ్ ను ఉద్యోగులు, సొసైటీ ప్రతినిధులు పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, రాజేశ్వర్ రావు, ఎ.శ్రీనివాస్, ఎస్.ప్రభాకర్ రెడ్డి, ఎం.శ్రీనివాస్ రావు, శ్రీధర్ రెడ్డి, సంధ్యారాణి, దామోదర్, నర్సింహమ్మరాజు, ఎక్‌నాథ్, వెంకటేష్, శాస్త్రీ, రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ గౌడ్‌ను సత్కరిస్తున్న బీటీఎన్జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

హామీల అమలుకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గిరిజనుల హామీల అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలంగాణ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది . ఈ సందర్భంగా శ్రీరామ్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా చేవెల్ల డిక్లరేషన్ పేరుతో గిరిజనులకు ఇచ్చిన 16 హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం.ధర్మనాయక్, రైతుసంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, భూక్య వీరభద్రం,బీమా సాహెబ్, బాలు నాయక్, చందునాయక్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్‌నాయక్

బహుజన్ రాజ్యాధికార పార్టీ ఆవిర్భావం



పార్టీ లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజన్ రాజ్యాధికారం పార్టీ ఆవిర్భావ సభ శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా పార్టీ లోగోతోపాటు విధివిధానాలను ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులుగా జన్ను సాంబయ్య ,ఉపాధ్యక్షులుగా ఎండ్ల రవి ముదిరాజ్ , కిసర రజిత, ప్రధాన కార్యదర్శిగా బుర్రి సాగర్, అధికార ప్రతినిధిగా అంకేశ్వర్ రమేష్ , కార్యదర్శిగా మధుకర్‌నాయక్‌లను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జన్ను సాంబయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి అండగా ఉంటూ బహుజన మహానీయుల ఆశయాలను ముందుకు తీసుకుపోతాం అన్నారు.

హౌసింగ్ బోర్డులకు ఓనర్‌షిప్ ఇవ్వాలి



మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న బాగ్‌లింగంపల్లి హౌసింగ్ బోర్డు షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని హౌసింగ్ బోర్డు షాపులకు ఓనర్‌షిప్ ఇవ్వాలని కోరుతు శనివారం హౌసింగ్ బోర్డు షాప్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.హౌసింగ్ బోర్డు షాపుల ఓనర్‌షిప్ 2010 నుంచి పెండింగ్‌లో ఉందన్నారు. ఈ షాపుల కిరాయి దారులు హౌసింగ్‌బోర్డుకు తొలుత 50వేల నుంచి లక్ష 50వేల వరకు అడ్వాన్స్ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ రేటు ప్రకారం ఓనర్‌షిప్ ఇవ్వాలని 2006లో అప్పటి ప్రభుత్వాన్ని కోరగా తమతో చర్చలు జరపారని తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

- ధ్వజారోహణంతో ముగిసిన టీటీడీ శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు
- వివిధ వాహన సేవలపై ఊరేగిన స్వామివారు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం (టీటీడీ)లో శ్రీవారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు సందర్భంగా ఉదయం 8.30 గంటలకు మహాపూర్ణాహుతి, 10.30 చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు శ్రీపుష్ప యాగం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తికి పుష్కరిణిలో స్నానం చేయించి, మంత్రోచ్చరణలు, భజనలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి నిర్వహించిన ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవ సమయంలో ఏర్పడిన సకల దోషాలను తొలగించేందుకు పరిపూర్ణుడైన పరమాత్ముడిని ప్రార్థించి, నిత్య ఆసీస్సులను అందించిన అగ్నిదేవుడిని ప్రసన్నం చేసుకునే మహాపూర్ణాహుతి పర్వం ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరిగింది. చక్రస్నానం నాటి సాయంకాలం ధ్వజారోహణం యథావిధిగా చేశారు. ఐదు రోజులపాటు వివిధ వాహన సేవలపై అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలను రోజూ వేలాది మందికి భక్తులు హాజరై తిరుమలేశుని వాహన సేవలను తిలకించారు. భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ తదితర ప్రముఖులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల దాత త్రినాథ్ బాబు సహకారంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ టీటీడీ సిబ్బంది, పోలీసుల సమన్వయంతో ముందుస్తు చర్యలు చేపట్టి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేశామని ఆలయ ఏఈఓ రమేష్ స్పష్టం చేశారు.



ఉత్సవ మూర్తులకు హారతినిస్తున్న అర్చకులు